సాక్షి
కుమురం భీం

మంగళవారం : 28 : మార్చి : 2023



రాములోరి తలంబ్రాలకు స్పందన
ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల్లో రాములోరి తలంబ్రాల బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. 10లో▸



భయం.. భయం!
కాగజ్‌నగర్ మండల వ్యాప్తంగా పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏ వీధిలో చూసినా మందలుగా శునకాలు దర్శనమిస్తున్నాయి. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 37.5 /24.3
ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ మంగళ : 6:28 | సహర్ బుధ : 4:51

న్యూస్‌రీల్

31న జాబ్ మేళా

ఆసిఫాబాద్అర్బన్: ప్రముఖ ప్రైవేట్ కంపెనీ ఫ్లిఫ్‌కార్టులో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 31న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. డెలివరీ ఎక్స్‌క్యూటీవ్ పోస్టులు 50 ఖాళీలు ఉన్నాయని, 18 సంవత్సరాలు పైబడి, పదో తరగతి పైన విద్యార్హత ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి రూ.13 వేల నుంచి రూ.22,500 వరకు వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 94405 14962, 99081 87894 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మైనార్టీ రుణాల కోసం రేపు ఇంటర్వ్యూలు

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖలో 2022- 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 29న కాగజ్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.అంజయ్య తెలిపారు. సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

ఎస్పీఎంలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ పేపర్ మిల్లులో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొలెం వెంకటేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. మిల్లు పునఃప్రారంభం కావడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న స్థానికులకు నిరాశే మిగిలిందన్నారు. స్థానికేతరులకు మిల్లు యాజమాన్యం రూ.వేల జీతాలు చెల్లిస్తూ ఉపాధి కల్పించడం సరికాదన్నారు. మిల్లు యాజమాన్యం స్పందించి స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్అర్బన్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 92వ వర్ధంతి పురస్కరించుకుని ఈ నెల 31న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 10 గంటల నుంచి డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానంతో ప్రతిఒక్కరూ ప్రాణదాతలుగా నిలవాలన్న నినాదంతో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన పరీక్షకు మొత్తం 4,724 మంది హాజరు కావాల్సి ఉండగా, 4,557 మంది హాజరు కాగా, 167 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు.

'చలో ఢిల్లీ' జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆనంద్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్ పట్టణంలో సోమవారం ఆశ కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి ఆశ కార్యకర్తలు ముందుకు రావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టడానికి కదం తొక్కాలని పిలుపునిచ్చారు.

కరోనా టెన్షన్!



- దేశవ్యాప్తంగా మళ్లీ పెరుగుతున్న పాజిటివ్ కేసులు
- సరిహద్దు జిల్లాల్లోనూ అడపాదడపా నమోదు
- ప్రజలు ఆసక్తి చూపకపోవడంతో జిల్లాలో నిలిచిన వ్యాక్సినేషన్
- అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారుల సూచన

ఆసిఫాబాద్: దేశంలో కోవిడ్ క్రియాశీల కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. దేశవ్యాప్తంగా పాజిటివ్ కేసుల సంఖ్య పదివేల మార్క్ దాటగా, రాష్ట్రంలో 1,300 పైగా కేసులు నమోదయ్యాయి. పాజిటివిటీ రేటు కూడా 3ను దాటింది. అయితే జిల్లాలో పాజిటివ్ కేసులు లేకున్నా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. పొరుగున ఉన్న ఆదిలాబాద్, మంచిర్యాలలో అడపాదడపా కేసులు నమోదవుతుండటంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. గడిచిన వారం రోజుల వ్యవధిలో జిల్లాలో 40 మందికి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఒక్కరికి కూడా పాజిటివ్‌గా తేలకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

మొత్తం 12వేలకు పైగా కేసులు..
మొదటి వేవ్ సమయంలో అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో మహారాష్ట్ర సరిహద్దున ఉన్నా కేసుల సంఖ్య నామమాత్రంగానే నమోదైంది. అయితే 2020 ఏప్రిల్, మే నెలల్లో మాత్రం జిల్లాలో కోవిడ్ ఉగ్ర రూపం చూపింది. జిల్లా కేంద్రంలోనూ భారీగా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 12,088 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 120 మంది కోవిడ్‌తో మృత్యువాత పడినట్లు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేశారు. అయితే ఈ సంఖ్య అనధికారికంగా వెయ్యికి పైగానే ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటివరకు మొత్తం 3,58,334 మందికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 13,140 ఆర్‌టీపీసీఆర్ టెస్టులు ఉన్నాయి. గత వారం రోజులుగా జిల్లాలో 49 మందికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, పాజిటివ్ కేసులు నమోదు కాలేదు. అయితే జిల్లా వ్యాప్తంగా అనేక మంది జ్వరం, గొంతు నొప్పితో ఇబ్బందులు పడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

నిలిచిన వ్యాక్సినేషన్..
కోవిడ్ కేసుల పెరుగుదలను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యాక్సినేషన్‌ను ముమ్మరంగా నిర్వహించింది. విడతల వారీగా అర్హులైన వారందరికీ టీకాలు అందేలా క్షేత్రస్థాయిలో వైద్యసిబ్బందిని అప్రమత్తం చేసింది. జిల్లాలో ఇప్పటి వరకు 9,61,970 మందికి వాక్సిన్లు చేశారు. వీరిలో 4,30,904 మంది మొదటి డోస్, 3,97,932 మంది రెండో డోస్, 1,33,134 మంది ప్రికాషన్ డోస్ తీసుకున్నారు. తదనంతర కాలంలో కోవిడ్ కేసులు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు వ్యాక్సిన్లపై ఆసక్తి చూపలేదు. దీంతో జిల్లాలో వ్యాక్సినేషన్ ప్రక్రియను నిలిపివేశారు. అవసరమైన వారికి మాత్రమే టెస్టులు నిర్వహిస్తున్నారు. జిల్లాకు పొరుగున మహారాష్ట్ర ప్రాంతాలు ఉండటంతో కోవిడ్ వేగంగా వ్యాప్తి చెందేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ నేపథ్యంలో కేసులు పెరగక ముందే నివారణ చర్యలు ప్రారంభించాల్సిన అవసరం ఉంది.

జాగ్రత్తలు పాటించాలి
దేశవ్యాప్తంగా మళ్లీ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. మారుతున్న వాతావరణానికి అనుగుణంగా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. జనసమూహాలకు దూరంగా ఉండాలి. బయటకు వెళ్లినప్పుడు విధిగా మాస్కు ధరించి, భౌతిక దూరం పాటించాలి. జ్వరం, దగ్గు, జలుబు ఉంటే పరీక్షలు చేయించుకోవాలి. వేసవిలో జ్వరం, వాంతులు ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి.
– డాక్టర్ రామకృష్ణ, డీఎంహెచ్‌వో

సామాజిక తెలంగాణ నిర్మాణమే

కాంగ్రెస్ లక్ష్యం



ప్రజలకు అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- జిల్లాలో ముగిసిన పాదయాత్ర

రెబ్బెన(ఆసిఫాబాద్): సామాజిక తెలంగాణ నిర్మాణమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నది నాలుగు కోట్ల ప్రజల కోసమా.. కేసీఆర్ కుటుంబంలోని నలుగురి కోసమా అనేది తెలంగాణ ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని అన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 12వ రోజు ఆసిఫాబాద్ మీదుగా రెబ్బెన మండలానికి చేరుకుంది. సోమవారం కైరిగాం నుంచి ప్రారంభమైన యాత్ర ఎడవెల్లి, కొండపెల్లి బోరింగ్, కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్, ఇందిరానగర్, పుంజుమేరగూడ, రెబ్బెన, గోలేటి ఎక్స్‌రోడ్, పులికుంట, తక్కళ్లపల్లి మీదుగా మంచిర్యాల జిల్లా రేపల్లెవాడకు చేరింది. రాత్రి రేపల్లేవాడలోనే బస చేశారు. అంతకు ముందు యాత్రకు జనాలు నీరాజనాలు పలికారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా రహదారి వెంట భట్టి విక్రమార్క కోసం ఎదురు చూశారు. ఇందిరానగర్ గ్రామస్తులు తమ కష్టాలు, బాధలను ఏకరవు పెట్టారు. అనంతరం రెబ్బెన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జల్ జంగల్ జమీన్ కోసం పోరాడిన గిరిజనుల ఆత్మ గౌరవ బిడ్డ కుమురం భీం స్ఫూర్తిని రాష్ట్ర ప్రభుత్వం పాటించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన కుమురంభీం ప్రాజెక్టుకు కాలువలను తవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ రెబ్బెన మండలానికి మంజూరు చేసిన నంబాల ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు నిర్మాణం నత్తనడకనే సాగుతోందన్నారు. వట్టి వాగు ప్రాజెక్టు మెయింటనెన్స్‌పై ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో ప్రాజెక్టు భవి ష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. కాలువలు పూడ్చుకుపోవడంతో 24వేల ఎకరాలకు సాగు నీరందించాల్సిన ప్రాజెక్టు ప్రస్తుతం అతికష్టం మీద 6,500 ఎకరాలకు కూడా నీరందించలేక పోతోందన్నారు. కాంగ్రెస్ హయాంలో పూర్తిచేసిన ప్రాజెక్టులకు కాలువలు తవ్వడానికి ఈ ప్రభుత్వం వద్ద నిధులు లేవా అని ప్రశ్నించారు. తెలంగాణలో 86 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల బాగు కోసమే తెలంగాణను తెచ్చుకుంటే ఆత్మగౌరవం కూడా దక్కని దుస్థితి నెలకొందన్నారు.



కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద భట్టి విక్రమార్క కోసం ఎదురుచూస్తున్న పార్టీ కార్యకర్తలు

ఆంధ్రా బడాబాబులకు ధారాదత్తం
మన సంపద మనకే.. మన కొలువులు మనకే అని పోరాటం చేసి రాష్ట్రాన్ని తెచ్చుకుంటే తెలంగాణ సంపదను కేసీఆర్ దోపిడీ చేయడమే కాకుండా, ఇక్కడి వనరులను ఆంధ్రా బడాబాబుల కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నాడని భట్టి ఆరోపించారు. బొగ్గు గనుల కాంట్రాక్టులను ఆంధ్రా బడాబాబుల కంపెనీలకు కట్టబెడుతున్నారని తెలిపారు. కోల్ మైనింగ్ కంపెనీలో స్థానికులకు ఒక శాతం ఉద్యోగాలు కూడా దక్కడం లేదన్నారు. 80 శాతం స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ గ్రామాల్లో నివాసం ఉండే గిరిజనేతరులకు హక్కులు లేకుండా పోయాయన్నారు. అడవిలో తరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న మాలీ కులస్తులకు ధరణి వచ్చిన తర్వాత భూమిపై హక్కులు లేకుండా ఈ ప్రభుత్వం చేసిందని ఆరోపించారు.

బజ్జీల బండి వద్ద ముచ్చట..
రెబ్బెన మండల కేంద్రంలో బజ్జీల బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న బొడ్డు ప్రసాద్, శ్రీలత దంపతుల వద్దకు వెళ్లిన భట్టి విక్రమార్క వారితో కాసేపు ముచ్చటించారు. రోజువారీ ఆదాయం, కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులతో కలిసి పునుగులు తిన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్ రాథోడ్, పీసీసీ జనరల్ సెక్రెటరీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలు సంబంధిత శాఖల అధికారులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం ఈదులవాడ పంచాయతీకి 15వ ఫైనాన్స్ నిధులు పంచాయతీ ఖాతాల్లో జమ కావడం లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన బూసి భీమేశ్ అర్జీ సమర్పించాడు. రెబ్బెన మండలం నంబాల గ్రామంలోని తన పట్టా భూమికి కొలతలు తీసి, హద్దులు నిర్ణయించాలని ముదిపెల్లి పెంటయ్య దరఖాస్తు చేసుకున్నాడు. పిల్లలను పోషించుకునేందుకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని వాంకిడి మండలం బండకాష్ గ్రామానికి చెందిన తొడసం పత్రుబాయి, ఆత్రం బినాబాయి కోరారు. బెజ్జూర్ మండలం చిన్న సిద్దాపూర్ శివారులోని తమ పట్టా భూమికి సంబంధించిన పహాణిలో తన భర్త పేరు తప్పుగా నమోదు కావడంతో కొంతమంది అక్రమంగా పట్టా మార్పునకు ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకోవాలని మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అహేరికి చెందిన లలిత బాబులాల్ గంగావత్ కలెక్టర్‌కు విన్నవించింది. 72 శాతం వైకల్యం కలిగిన తన కుమారుడికి ఆసరా పింఛన్ మంజూరు చేయాలని బెజ్జూర్ మండలం లుంబిని నగర్‌కు చెందిన దుర్గం సునీత దరఖాస్తు చేసుకుంది. రెబ్బెన మండలం గోలేటికి చెందిన అజ్మీర మోతీలాల్ గ్రామ శివారులోని భూమికి పట్టా పాస్‌పుస్తకం మంజూరు చేసి రైతుబంధు వర్తింపజేయాలని అర్జీ సమర్పించాడు. డ్వాక్రా గ్రూపు సభ్యులు కలిసి తీసుకున్న రుణం తాను తీసుకున్నట్లు లెటర్ పంపించారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కౌటాల మండలం తుమ్మిడిహెట్టికి చెందిన కలగూర శంకరమ్మ కలెక్టర్‌కు విన్నవించింది. దహెగాం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ఎలకరి వెంకటమ్మ, చౌదరి మల్లయ్య, లట్కరి రామన్న, బోరె హనుమయ్య, దుర్గం పెంటక్క గ్రామ శివారులోని భూమికి రైతు బంధు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆసిఫాబాద్ మండలం బనార్‌వాడకు చెందిన బోయిరె లక్ష్మి ఇంటి స్థలం ఉందని, గృహ లక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందించాలని దరఖాస్తు చేసుకుంది.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి

ఆసిఫాబాద్అర్బన్: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ, పరిశ్రమల స్థాపనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సోమవారం పరిశ్రమల శాఖ అధికారితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న పరిశ్రమలైన జిన్నింగ్ మిల్లులు, రైస్ మిల్లుల ద్వారా అనేక మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. టీఎస్ ఐపాస్ పోర్టల్‌లో పరిశ్రమల స్థాపన కోసం దరఖాస్తు చేసుకున్న వారికి జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ ఆమోదం ప్రకారం అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. టీప్రైడ్ పథకం కింద 2 యూనిట్లకు పెట్టుబడి రాయితీ, 4 యూనిట్లకు వడ్డీ రాయితీ మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల ప్రాజెక్ట్ అధికారి అశోక్, ఎల్‌ఎండీ హనుమంత్‌రావ్, ఎస్సీ కార్పొరేసన్ అధికారి సజీవన్, డీటీసీపీ మైనింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ
ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఐదుగురు ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి సావిత్రి, క్షేత్రాధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో దేశంలోనే నంబర్‌వన్

- మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు
- గాదిగూడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నార్నూర్(ఆసిఫాబాద్): ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉందని, ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు అన్నా రు. సోమవారం గాదిగూడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికే ఈ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆరునెలల్లో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్ పర్సన్లు రాథోడ్ జనార్దన్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు యునుస్ అక్బానీ, ఎంపీపీ అడ చంద్రకళ రాజు, వైస్ ఎంపీపీ యోగేశ్, మండల అధ్యక్షుడు పూసం బాదిరావు, 25 గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారదాసు లక్ష్మణ్‌రావు

'ఉపాధి' కూలి పెరిగింది

- రోజువారీ కూలి రూ.15 పెంచుతూ ఉత్తర్వులు
- ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి..
- హర్షం వ్యక్తం చేస్తున్న కూలీలు

చింతలమానెపల్లి(సిర్పూర్): కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ కూలి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెంచిన కూలి ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానుంది. పేదలకు వంద రోజులపాటు ఉపాధి కల్పించే ఈజీఎస్ పనుల కూలిని పెంచాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ప్రభుత్వ నిర్ణయంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 16,489 జాబ్ కార్డులు ఉండగా, 2,49,328 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు.

'ఉపాధి'పై ఆధారం
గ్రామీణ ప్రజల జీవితాలను కోవిడ్ తీవ్రంగా ప్రభావితం చేసింది. సాధారణ రోజుల్లో పట్టణ ప్రాంతాల్లో పనిచేసుకుని వ్యవసాయ పనులకు, ఇతర కూలీ పనులపై గ్రామీణులు ఆధారపడేవారు. మూడు సంవత్సరాల పాటు కోవిడ్ ప్రజలకు ఎలాంటి పనులు లేకుండా చేసింది. చాలా మంది ఉపాధిహామీ పనుల ఆధారంగా వచ్చిన డబ్బులతోనే జీవనం సాగించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న రోజువారీ కూలికి అదనంగా రూ.15 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఈ నెల 24న ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా ఉపాధిహామీ అధికారులకు ఆదేశాలు అందాయి. ఏప్రిల్ 1 నుంచి పెంచిన కూలి అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదైన పనిదినాల ఆధారంగానే చెల్లింపులు జరుగుతాయని వారు పేర్కొంటున్నారు. కూలీల ఖాతాల్లోకి నేరుగా ఈ మొత్తాన్ని పాత పద్ధతిలో జమ చేయనున్నారు. ఒక కూలీ వంద రోజులు పనిచేస్తే గతంలో రూ.25,700 వచ్చేది. ప్రస్తుతం పెంచిన కూలితో రూ.27,200 ప్రభుత్వం చెల్లించనుంది. సగటున 100రోజుల పూర్తి పనిదినాలు పని చేసిన కూలీకి రూ.1500 పెంచిన మొత్తం వస్తుంది.



చింతలమానెపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఇప్పటి వరకు ఒక పని దినానికి రూ.257 చెల్లిస్తుండగా తాజాగా పెంచిన రూ.15లతో ఒక పనిదినానికి రూ.272 అందించనున్నారు.


బీమా కోసం డిమాండ్..
కూలి పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉపాధిహామీ కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు ప్రభుత్వం కూలీలకు అనువుగా నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నారు. మండు వేసవిలో మట్టిపని చేసే సమయంలో ప్రమాదాల బారిన పడే అవకాశాలు అధికం. పంట భూముల్లో విష పురుగులతోనూ ప్రమాదం పొంచి ఉంది. ఈ పరిస్థితుల్లో కూలీలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని కూలీలు కోరుతున్నారు. ప్రమాద బీమా, ఆరోగ్య బీమా ప్రభుత్వం చెల్లిస్తే కుటుంబాలకు భరోసాగా ఉంటుందని ప్రభుత్వాలకు విన్నవించుకుంటున్నారు. మరోవైపు సాంకేతిక సమస్యల కారణంగా నగదు చెల్లింపుల్లో సమస్యలు వస్తున్నాయని, సిగ్నల్ లేని కారణంగా నమోదులో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కొంత ఊరట



ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలకు ఒకరోజు కూలి రూ.15 పెంచడం సరైన నిర్ణయం. మాకు పెంచిన కూలితో ఉపాధి పెరుగుతుంది. సాధారణంగా పనుల నమోదు, ఇతర సమస్యలతో పూర్తిగా చెల్లింపులు జరగడం లేదు. పెంచిన కూలితో మాకు కొంత ఊరట ఉంటుంది.
– గుర్లె తిరుపతి, దబ్బా

బీమా చెల్లించాలి



ఉపాధి పనిచేసే స్థలంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రమాద, ఆరోగ్య బీమా ప్రభుత్వం చెల్లించాలి. ప్రమాదం జరిగినపుడు కుటుంబాలకు ఉపయోగంగా ఉంటుంది.
– మానెపల్లి పోషయ్య, దబ్బా

క్లుప్తంగా

పశువులు పట్టివేత


పట్టుకున్న పశువులతో సభ్యులు

కెరమెరి: మండలంలోని కెలికే గ్రామంలో సోమవారం పశువుల రవాణాను గోరక్షక దళ సభ్యులు పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి కెరమెరికి ఐదు పశువులను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారంతో సభ్యులు కాపు కాశారు. ఈక్రమంలో పశువుల మందతో రఫీక్ వస్తుండగా ఆయన్ను అడ్డగించి పోలీసులకు సమాచారం అందించారు. పట్టుకున్న పశువులను గ్రామ పంచాయతీకి అప్పగించినట్లు సభ్యులు బోశే గోవింద్, బాణోత్‌రామ్ నివాస్, రాథోడ్ గజానంద్, జాదవ్ గోపాల్ తెలిపారు.

వైఎస్సార్‌టీపీ సేవాదళ్ కమిటీల నియామకం

మంచిర్యాలక్రైం: వైఎస్సార్‌టీపీ సేవదళ్ విభాగంలో జిల్లా, మండల, గ్రామ కమిటీలను రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సతీశ్ ఆదేశాలతోనే సోమవారం నియమించినట్లు ఆ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గాదే సాయి తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా గర్రెపెల్లి మనోజ్‌కుమార్, జిల్లా కార్యదర్శిగా మునిగంటి రాజేంద్రప్రసాద్, మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా తనీర్ అరుణ్‌కుమార్, మండల అధ్యక్షుడిగా కొండ శివ, కాసిపేట మండల అధ్యక్షుడిగా గోసిక సంపత్, బెల్లంపెల్లి పట్టణ అధ్యక్షుడిగా పగిడి లక్ష్మణ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

పులిదాడిలో గేదె మృతి


గేదె మృతదేహం

సిర్పూర్(టి): మండలంలోని చీలపెల్లి అటవీ ప్రాంతంలోని భీమన్నగుట్ట సమీపంలో ఆదివారం సాయంత్రం పులిదాడిలో గేదె మృతి చెందింది. చీలపెల్లి గ్రామానికి చెందిన సుర్పం అర్జుకు చెందిన గేదె అటవీప్రాంతానికి మేతకు వెళ్లి తిరిగి రాలేదు. అర్జు, గ్రామస్తులు కలిసి సోమవారం గాలించగా పులిదాడిలో గేదె మృతిచెంది కనిపించింది. అటవీశాఖ బీట్ అధికారులు సంతోష్, అరవింద్‌కు గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని పులిఅడుగు జాడలను గుర్తించారు. గేదెపై పులిదాడి చేసి హతమార్చిందని ఎఫ్‌ఆర్వో పూర్ణచందర్ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఓ కాలనీకి చెందిన మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిపై పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు మైనర్ బాలిక కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సోమవారం రాత్రి పోక్సో కేసు నమోదు చేసినట్లు సమాచారం. యువకుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

మాకూ 'పే స్కేల్' వర్తింపజేయాలి

- సెర్ప్ ఉద్యోగులతో సమానంగా జీతాలు పెంచాలి
- వినతిపత్రాలు అందించి సిబ్బంది నిరసన
- ఉపాధి హామీ–సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్

ఉపాధి హామీ పథకం..	
ఏపీఓలు	12
కంప్యూటర్ ఆపరేటర్లు	65
సాంకేతిక సహాయకులు(టీఏ)	70
ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు	10
ప్లాంటేషన్ సూపర్‌వైజర్	2
సీడీ డీఎల్ఆర్‌సీ	2
అదనపు డీఆర్‌పీ	1
మొత్తం	162
సమగ్ర శిక్ష ఉద్యోగుల..	
క్లస్టర్ రీసోర్స్ పర్సన్లు	51
పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు	80
ఐఈఆర్‌పీలు	24
సీసీఓలు	12
కేర్ టేకర్లు	14
ఎంఐఎస్‌లు	12
మెస్సెంజర్లు	14
డీపీఓ ఉద్యోగులు	6
మొత్తం	213


ఉపాధి హామీ పనుల పర్యవేక్షణలో డీఆర్‌డీఓ శేషాద్రితో ఈజీఎస్ సిబ్బంది, కూలీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో తమకు కూడా పే స్కేల్ వర్తింపజేయాలని ఉపాధి హామీ, సమగ్ర శిక్ష పథకాల ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో 162 మంది, సమగ్ర శిక్ష పథకంలో 213 మంది వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా చాలీచాలనీ వేతనాలతో కుటుంబాలను నెట్టుకువస్తూ ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేస్తుండడంతో జిల్లాలోని ప్రాజెక్ట్ మేనేజర్, 4 జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు, 21 అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, 64 సీసీలు, 30 ఎంఎస్ సీసీలు, 5 సీసీఓలు, 4 ఆఫీస్ సబ్ ఆర్డినేటర్లు కలిపి మొత్తం 129 మందికి ఆర్థిక ప్రయోజనాలు కలుగుతున్నాయి. సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేస్తామని గత ఏడాది సీఎం ఇచ్చిన హామీ మేరకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సెర్ప్ ఉద్యోగుల వేతనాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. దీంతో సెర్ప్ ఉద్యోగుల్లో సంబురాలు నెలకొన్నాయి. తమకు పే స్కేల్ వర్తింపజేయాలని కోరుతూ ఇటీవల ఇటు ఈజీఎస్ అటు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు కూడా అందజేశారు.

బడ్జెట్ ఆమోదం లేకున్నా జీతాలు ఇవ్వొచ్చు..

ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఉద్యోగులకు పే స్కేల్ ప్రకారం వేతనాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌తో కానీ ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం కానీ లేదని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేయడానికి కేంద్ర కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు కేటాయిస్తోంది. ఉపాధి హామీ పనుల కోసం ఖర్చు చేసే నిధులలో పది శాతాన్ని ఉద్యోగుల వేతనాలకు కేటాయించడానికి పూర్తి అవకాశం ఉంది. ఉద్యోగుల వేతనాల కోసం ఖర్చు చేయాల్సిన నిధులు ప్రతీ ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.వందల కోట్లలో మిగులుబాటు అవుతున్న విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని అంటున్నారు.

ఉద్యోగుల సమస్య గుర్తించాలి..



ఉపాధి హామీ పథకం కింద ఏళ్ల తరబడి పని చేస్తూ ప్రభుత్వానికి మా శ్రమను ధారబోస్తున్నాం. ఉపాధి కూలీలకు పని కలిపించడంతోపాటు ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం అవుతున్నాం. ఉద్యోగులంతా ఒత్తిడిలోనూ రాణిస్తూ కూడా ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తూ లక్ష్యాలను చేరుకుంటున్నాం.

– మల్లయ్య, ఈజీఎస్, ఏపీఓ, హాజీపూర్

విద్యాభివృద్ధికి కృషి..



సమగ్ర శిక్ష పథకం కింద పని చేస్తున్న ఉద్యోగులుగా విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నాం. ప్రభుత్వం ఏ కార్యక్రమం అప్పగించినా ఆ పనిని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని అందుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో భాగస్వామ్యం అయిన తమపై ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకునేలా చూడాలి.

– పి.నగేశ్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్, సమగ్ర శిక్ష

క్వారీలో శవమై తేలిన యువకుడు

బెల్లంపల్లి: ఇంట్లో నుంచి వెళ్లి అదృశ్యమైన ఓ యువకుడు క్వారీలో పడి శవమై తేలిన ఘటన వెలుగుచూసింది. తాళ్లగురిజాల ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి మండలం బుధాకలాన్ గ్రామానికి చెందిన కళ్యాణం సాయిరాం (28) అనే యువకుడు కొద్ది రోజుల నుంచి తీవ్రమైన మానసిక ఒత్తిళ్లతో సతమతమవుతున్నాడు. మంచిర్యాలకు వెళ్లి వైద్యుడికి చూపించుకోగా మందులు రాసిచ్చాడు. ఈనెల 25న సాయిరాం ఇంట్లో నుంచి బైక్ పై బెల్లంపల్లికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఈజీఎస్ పనులకెళ్లి ఇంటికి వెళ్తున్న సాయిరామ్‌కు తల్లి కనిపించింది. ఆమెతో మాట్లాడకుండానే వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తర్వాత ఇంటి తాళాలు ఎక్కడున్నాయో తల్లికి ఫోన్ చేసి చెప్పి సాయిరాం సాయంత్రం ఇంటికి తిరిగివస్తానని చెప్పాడు. కాల్‌టెక్స్ ఏరియాలో ఉన్న గొంతెమ్మ గుట్ట క్వారీ వద్దకు వెళ్లి బైక్‌ను అక్కడ పార్కింగ్ చేసి క్వారీలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు ముందు ఓ నోటు పుస్తకంలో అమ్మానాన్నలకు భారం కావొద్దని, బతికి ఏదైనా సాధించాలని రాసుకున్నట్లు తెలుస్తోంది. మానసిక ఒత్తిడిని భరించలేక సాయిరాం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని సోమవారం క్వారీ నుంచి బయటకు వెలికితీసి పోస్టుమార్టం చేయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి జైలు

కడెం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన ఆరుగురికి ఖానాపూర్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై రాజు తెలిపారు. సోమవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా, జైలు శిక్ష విధించారన్నారు. వారిని నిర్మల్ జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల ప్రజలు అర్జీలు అందజేశారు. రైతుబంధు, డబుల్ బెడ్రూం, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు సమర్పించారు. శాఖల అధికారులు అర్జీలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొమురం బాలు, ఓఎస్డీ కిష్టయ్య, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

కాగజ్‌నగర్‌టౌన్: మండలంలోని ఈజ్‌గాం విలేజి నెంబర్ 10కు సమీపంలో గల రైల్వే పట్టాల పక్కన ఒక వ్యక్తి అనుమానస్పదంగా మృతిచెందాడు. కాగజ్‌నగర్ రైల్వే జీఆర్పీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేశ్ గౌడ్ కథనం ప్రకారం.. సోమవారం ఉదయం ఒక వ్యక్తి రైల్వే పట్టాల కింద పడి ఉన్నట్లు అందిన సమాచారంతో సిబ్బంది అక్కడికి వెళ్లారు. క్షతగాత్రుడిని స్థానిక సీహెచ్‌సీకి తరలించేలోపే మృతిచెందాడు. మృతుడిని గుప్తా ధర్మేందర్ కుమార్ (40)గా గుర్తించామని, మృతుడు నేపాల్ దేశానికి చెందిన వాడిగా పాస్‌పోర్టు జిరాక్స్ లభించిందని జీఆర్పీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆగని భూ ఆక్రమణలు

- నస్పూర్‌లో ఎకరం ప్రభుత్వ భూమి కబ్జా
- భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు


ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన కంచె

నస్పూర్: జిల్లాకేంద్రానికి ఆనుకొని ఉన్న నస్పూర్‌లో భూ ఆక్రమణలు ఆగడం లేదు. నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్ భవనం ఏర్పడుతుండడం, కోల్‌బెల్ట్ ప్రాంతం కావడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇదే అదనుగా భావించిన కొందరు రాజకీయ, ఆర్థిక, అంగబలంతో యథేచ్ఛగా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వ సెలవు రోజునే సరైన సమయంగా ఎంచుకోవడం విశేషం. నస్పూర్ శివారు సర్వే నంబర్ 119లోని సుమారు ఎకరం ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీని విలువ సుమారు రూ.2 కోట్ల వరకు ఉంటుంది. ఎలాంటి అనుమతి లేకుండా సదరు భూమిలోకి వెళ్లడానికి దారిని ఏర్పాటు చేయడం విశేషం. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఈ భూమని కొందరు కబ్జాకు ప్రయత్నించారు. అధికారుల చొరవతో విరమించుకున్నారు. తిరిగి ఆ భూమిని కబ్జా చేశారు. దీనిపై తహసీల్దార్ జ్యోతిని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని, సిబ్బందిని పంపించి వివరాలు సేకరిస్తామని తెలిపారు.

ఓసీపీల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

- భూ నిర్వాసితుల డిమాండ్
- గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా


డీఎస్పీ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాం నాయక్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఓసీపీల్లో స్థానికులే ఉద్యోగాలు ఇవ్వాలని సింగరేణిలో భూములు కోల్పోయిన నిర్వాసితులు డిమాండ్ చేశారు. సోమవారం గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాం నాయక్ మాట్లాడుతూ స్థానికుల నుంచి భూములు తీసుకుని ఏర్పాటు చేసిన సింగరేణి ఓసీపీల్లో ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలను నుంచి వందలాది మందిని తీసుకువచ్చి పనులు చేయిస్తూ స్థానిక యువతకు ఉద్యోగాలు లేకుండా చేస్తున్నారని అన్నారు. భూములు కోల్పోయిన నిర్వాసిత యువతకు, ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల యువకులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సింగరేణిలో భూములు కోల్పోయి ఉపాధి లేకుండా చేసిన యాజమాన్యం ఓబీ కాంట్రాక్ట్ సంస్థలకే వత్తాసు పలుకుతూ స్థానిక యువతకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుండి తీసుకువచ్చిన కూలీలను వెంటనే పంపించి స్థానిక యువకులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్‌అండ్‌ఆర్ సెంటర్లలో ఆరోగ్యం, విద్యా పరంగా యాజమాన్యం పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు అల్లం నరేందర్, వాంకిడి సీఐ శ్రీనివాస్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని భూనిర్వాసితులతో మాట్లాడారు. ఆత్మారాంతో పాటు పలువురిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బీజేపీ నాయకుడిపై కేసు

తిర్యాణి: కార్మికుల విధులకు ఆటంకం కలిగించిన బీజేపీ నాయకుడు ఆత్మారాం నాయక్‌పై కేసు నమోదైంది. కైరిగూడ ఓసీపీ పరిధిలోని జీఆర్ఎన్ ప్రైవేట్ కంపెనీలో సోమవారం విధులు నిర్వహించేందుకు వెళ్తున్న కార్మికులకు ఉల్లిపిట్ట ఎక్స్ రోడ్డు వద్ద ఆత్మారాం నాయక్ భయభ్రాంతులకు గురిచేశారని ఎస్అండ్‌పీసీ అధికారి రాజమౌళి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై రమేశ్ పేర్కొన్నారు.

కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి


కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

నస్పూర్: ఏరియాలోని వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్, ఆటోగ్యారేజి, ఏరియా స్టోర్, టింబర్ యార్డ్, ఆర్‌కే 8 డిస్పెన్సరీలో బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినెల మూడుసార్లు నిర్వహించే మెడికల్ బోర్డు నెలకోసారి నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులకు రెస్ట్‌హాల్స్ మినరల్ వాటర్ సౌకర్యం, రేడియం జాకెట్స్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వారికి ఇవ్వాల్సిన స్పెషల్ ఇన్సెంటివ్‌ను వెంటనే ఇవ్వాలన్నారు. మహిళా సిబ్బందికి స్పెషల్ లీవ్ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణ శ్యాం, గరిగ స్వామి, నాయకులు పెట్టం శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రవిశంకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'దళితుల అభివృద్ధికి తోడ్పడని ప్రభుత్వాలు'


మహాసభ పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ప్రభుత్వాలు దళితుల అభివృద్ధికి తగిన తోడ్పాటు అందించడం లేదని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు డీఆర్.శ్రీధర్, జిల్లాప్రధాన కార్యదర్శి దేవి పోశన్న అన్నారు. సోమవారం బెల్లంపల్లి పట్టణ సీపీఐ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు 15 శాతం దళితుల అభివృద్ధికి కేటాయించాల్సి ఉండగా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుతో దళితులు వెనుకబాటుకు గురవుతున్నారన్నారు. దళితుల సమస్యలు, భవిష్యత్ పోరాట కార్యక్రమాలు రూపకల్పనకు ఈ నెల 31న హైదరాబాద్‌లో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రథమ మహాసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మారపెల్లి రవి, నాయకులు జీసీ మాణిక్యం, నర్సింగరావు, ఆడేపు రాజమౌళి, బియ్యాల ఉపేందర్, వెంకటస్వామి, అక్కెపల్లి బాపు, జాడి పోశన్న, మామిడి గోపి, బండారు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సినీరంగంలో రాణిస్తున్న పాతబస్తీ యువకుడు

- దసరా సినిమాలో మూడు అవకాశాలు
- తెలంగాణ యాస భాషను ప్రపంచానికి పరిచయం చేస్తున్న సురేష్



కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి పంచాయతీ సోమగూడెం పాత బస్తీకి చెందిన గడ్డం సురేష్ సినీ రంగంలో రాణిస్తున్నాడు. పెద్ద బ్యానర్‌పై నిర్మిస్తున్న సినిమాలో ఏకంగా మూడు అవకాశాలు వచ్చాయి. దసరా సినిమాలో తెలంగాణ మాండలికం(డైలాగ్) రైటర్, పాటల రచయిత, కళాకారుడు(నటుడు)గా చేసి ఒకే సారి పెద్ద గుర్తింపు తెచ్చుకున్నాడు. శ్రీలక్ష్మి వేంకటేశ్వర సినిమా(ఎస్ఎల్‌వీసీ) బ్యానర్‌లో శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చెరుకూరి సుధాకర్ నిర్మించిన, ప్రముఖ నటులు నాని, కీర్తి సురేష్, సాయికుమార్, దీక్షిత్‌శెట్టితో తీసిన దసరా తెలంగాణ యాస డైలాగ్‌లు ప్రపంచానికి పరిచయం కానున్నాయి. ఐదు భాషల్లో తీసిన సినిమా ఈనెల 29న అమెరికాలో విడుదల అవుతుండగా, 30న పలు రాష్ట్రాల్లో విడుదల కానుంది. ఈనెల26న అనంతపూర్‌లో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ చేపట్టడంతో సినిమా నిర్వాహకులు, హీరోలు సురేష్‌ను కొనియాడారు. దీంతో కాసిపేట మండలంతోపాటు కోల్‌బెల్టు ప్రాంతాలైన బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాలలో ఈవెంట్ దసరా సినిమా పాటలు వాట్సాప్ గ్రూప్‌లో, స్టేటస్‌ల్లో చక్కర్లు కొడుతున్నాయి.

సంతోషంగా ఉంది

సినిమాల్లో అవకాశాల కోసం కళాకారులు ఎదురు చూస్తూ గడుపుతున్నారు. పెద్ద బ్యానర్‌పై నిర్మిస్తున్న ఒకే సినిమాలో రైటర్, ఆర్టిస్ట్, పాటల రచయితగా అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. దర్శకుడు, నిర్మాత, నటులు అందరూ ఆదరించారు. ప్రస్తుతం మంచి అవకాశాలు వస్తున్నాయి.

– గడ్డం సురేష్

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం


సీఈవో రాకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ మానెపల్లి బాపుపై 8 మంది సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు తీర్మానం కోరుతూ సీఈవో రాకేశ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈనెల 31న ప్రత్యేక అత్యవసర సమావేశం నిర్వహిస్తామని, సభ్యులు హాజరుకావాలని సీఈవో నోటీసులు జారీ చేశారు. 31న సభ్యులు చేసిన తీర్మానాన్ని జిల్లా అధికారికి నివేదిస్తామని పేర్కొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం


సుఖప్రసవం అనంతరం మహేశ్వరితో సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం చిన్నగోపాల్‌పూర్‌కు చెందిన సీడం మహేశ్వరి సోమవారం ప్రతిస్పందన అంబులెన్స్‌లో ప్రసవించింది. నెలలు నిండి పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో మెడికల్ టెక్నీషియన్ 108 కాల్ సెంటర్ వైద్యుడి సూచనల మేరకు మహేశ్వరికి సుఖప్రసవం జరపగా మగశిశువుకు జన్మనిచ్చింది.

ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడి


కోణంపేటలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి కల్పన

నెన్నెల: ఆధునిక పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి కల్పన రైతులకు సూచించారు. మండలంలోని కోణంపేట, పాటి గ్రామాల్లో ఆమె సోమవారం పర్యటించారు. పంట పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. యంత్రాలను ఉపయోగించి కూలీల ఖర్చులు తగ్గించుకోవాలని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, పీఎం కిసాన్ తదితర సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుబీమా తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. కుటుంబ పెద్ద అకాల మరణం చెందితే సాయంగా వచ్చే రూ.5లక్షలతో ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని అన్నారు. పీఎం కిసాన్ కోసం ఈకేవైసీ తప్పకుండా చేసుకోవాలని, పీఎం కిసాన్ డబ్బులు బ్యాంకు ఖాతాలకు బదులు కొందరు రైతుల పోస్టల్ ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు. నెన్నెల ఏఈఓ రాంచందర్ పాల్గొన్నారు.